

# చావు తప్పితే చాలు...
## డిటెక్టివ్ యుగంధర్ పరిశోధన
## కొమ్మూరి సాంబశివరావు రచన



47 సంవత్సరాల క్రిందట విడుదలైన ఈ నవల ఆ రోజుల్లో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. 1962 నుంచీ 1976 వరకూ మూడు సార్లు పునర్ముద్రించబడింది. దాదాపు 15,000 కాపీలు పైగా అమ్ముడుపోయాయి ఆ రోజుల్లోనే. ఈ నవల పుస్తకం వెనుక నున్న క్రింది వాక్యాలు నవల పట్ల ఉత్కంఠతని రెట్టింపు చేస్తాయి.

***

భారతి భుజాల మీద ఏదో చేతులు వేసింది. మొహానికి ఏదో రాసుకుంది? ఏమిటది?

మెట్లమీద ప్రసాద్ చూసిన ఆకారం ఏమిటి? మనిషి కాదని నిశ్చయంగా ఎందుకన్నాడు? వైకుంఠరావు చనిపోయి రెండు రోజులైంది. అతని శవం, మేడమీద కుర్చీలో ఎట్లా ఉంది? ఇంట్లో ఎట్లా తిరుగుతోంది?

"దూరంగా పొండి, తలుపు దగ్గరకి వెళ్ళకండి" అని అరుస్తూ భారతి ప్రసాద్‌నీ, శేఖర్‌నీ ఎందుకు వెనక్కి లాగింది.?

ఈ పుస్తకం రాత్రిళ్ళు ముట్టుకోవద్దు. ఒంటరిగా ఉన్నప్పుడు చదవొద్దు. భయం వేసినప్పుడు అప్పటికి చదవడం ఆపి కొంతసేపటి తర్వాత మళ్ళీ మొదలుపెట్టండి..!

(తెలుగులో మొట్టమొదటి హారర్ ఫిక్షన్ నవల ఇది . మొదటి ముద్రణ: 1962లో)



(క్రిందటి సంచిక నుంచీ తరువాయి)

## 20

**వైకుంఠరావుకి** నిద్రపట్టలేదు. పక్కమీద ఇటునుంచి అటు చాలాసార్లు దొర్లి దిండు రకరకాలుగా మార్చి నిద్రపోవడానికి ప్రయత్నించాడు కాని నిద్రపట్టలేదు. భారతి గదిలో శేఖర్‌ని చూడగానే అతని ఒళ్ళు మండిపోయింది. ఎవరో అనామకురాలు శేఖర్‌ని తన వశం చేసుకుంటోంది. తన కూతురు పద్మకోసం గతించిన తన భార్య మనశ్శాంతి కోసం, శేఖర్ క్షేమం కోసం తను జోక్యం కలిపించుకుని శేఖర్ భారతిల స్నేహం చెడగొట్టాలని నిశ్చయించుకున్నాడు,

ఏం చెయ్యాలి? భారతి మీద శేఖర్‌కి కోపమూ అసహ్యం కలిగేట్లు చేయడం ఎలా అని ఆలోచిస్తున్నాడు. బల్లమీదవున్న చేతి గడియారం తీసి చూశాడు. పదకొండు గంటలయింది. చప్పుడు చెయ్యకుండా తలుపు తెరిచాడు.

వైకుంఠరావుకి దెయ్యాలలో, భూతాలలో ఎన్నడూ నమ్మకం లేదు. ప్రసాద్ చెప్పిన విషయం అసలు నమ్మలేదు. కుర్రవాడు భయపడి భ్రమలో పడ్డాడని అనుకున్నాడు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నడవడం ప్రారంభించాడు. లింగమూర్తి గదిలోంచి గురక వినపడుతోంది. ఎక్కడా దీపాలు లేవు. చీకటిగా ఉన్నా వైకుంఠరావు ముందుకి సాగిపోయాడు. తను చెయ్యనున్న పని తలుచుకుని తనలో తనే నవ్వుకుంటున్నాడు. చాలా తెలివైన ఆలోచన స్ఫురించింది. ఎటొచ్చి బయట పడకూడదు. తను చేసినట్లు తెలియకూడదు. తెలిసిందా నామర్దా! హాల్లోకి వెళ్ళి క్షణంపాటు నిలబడి, ఇంట్లో ఎవరయినా మెలుకువగా ఉన్నారేమో తెలుసుకోవడానికి చెవులు రిక్కించుకుని విన్నాడు. అందరూ నిద్రపోతున్నారని నిశ్చయించుకుని మెట్లవైపు వెళ్ళాడు.

నెమ్మదిగా ఒక్కొక్క మెట్టుఎక్కడం ప్రారంభించాడు. అడుగు తీసి అడుగు వేస్తున్నప్పుడు స్వల్పంగా కూడా చప్పుడు కావడం లేదు. దాదాపు మెట్లన్నీ ఎక్కేసాడు. ఇంకా రెండు మెట్లు ఉన్నాయి. చేతికి ఏదో వెచ్చగా తగిలింది. పక్కకి చీకట్లోకి చూశాడు. ఆ చీకట్లో సరిగా ఏమీ కనిపించలేదు. కాని మెట్లమీద గోడకి ఆనుకుని అస్పష్టంగా ఓ ఆకారం కనిపిస్తోంది. నల్లని చీకట్లో మరీ నల్లగా ఉంది ఆకారం. వైకుంఠరావు గుండె దడదడ మన్నది. మెట్ల మీద కన్పించిన ఆకారం గురించి ప్రసాద్ చెప్పిన విషయాలు జ్ఞాపకం వచ్చాయి. అయినా ధైర్యం తెచ్చుకుని "ఎవరు నువ్వు?" అడిగాడు. ఆ ఆకారం పలకలేదు. కదలలేదు. ఉచ్వాస నిశ్వాసాలు మాత్రం వైకుంఠరావుకి వినిపిస్తున్నాయి.

దెయ్యం కాదు. మనిషే! ధైర్యం తెచ్చుకుని "చెప్పు ఎవరు నువ్వు?" అంటూ ఆ ఆకారం దగ్గరికి జరిగాడు.

అంతే తర్వాత ఏం జరిగిందో వైకుంఠరావుకి తెలియదు. పెద్ద ఇనుపగుండు తలమీద పడినట్లయింది. ఆ మెట్ల మీద అక్కడే కిక్కురు మనకుండా కూలిపోయాడు.

## 21

"ఎక్కడ దాచావు నగలు చెప్పు!"

రాజారాం కళ్ళు పెద్దవి చేసి చూశాడు. కటిక చీకటి. ఏమీ కనిపించడం లేదు. ఎవరు ఆ ప్రశ్న తనని అడుగుతున్నారు? ఏం జరిగింది? తను ఎక్కడ ఉన్నాడు? జ్ఞాపకం చేసుకోడానికి ప్రయత్నించాడు.

"ప్రాణం కన్నా డబ్బు ఎక్కువ కాదు. చెప్పు!" మళ్ళీ వినిపించాయి ఆ మాటలు. తన పక్కనుంచి కాదు. తన వెనకనుంచీ కాదు. ఎక్కడో దూరంనుంచి అడుగుతున్నట్లు వినిపించింది రాజారాంకి.

"ఎవరు నువ్వు?" అడిగాడు రాజారాం

"నే నెవర్నయితే నీకెందుకు? నేనడిగిన ప్రశ్నకి జవాను చెప్పు!"

తను ఎక్కడున్నదీ తెలుసుకోవడానికి చుట్టూ చూశాడు రాజారాం. తెలియలేదు. చీకట్లో ఏ గుర్తూ కనిపించడం లేదు. తెలిసిందల్లా తను మంచం మీద వున్నాడు. చేతులూ, కాళ్ళు మంచానికి కట్టేసివున్నాయి. కదలడానికి వీలు లేకుండా ఉంది. తన పక్కనే ఎవరో పడుకున్నారు! వెచ్చగా ఊపిరి మీదకి తగులుతోంది ఎవరది? పక్కకి తిరిగితే తెలుసుకోవచ్చు. కాని పక్కకి తిరగటానికి వీలుకాకుండావుంది.

"ఏం నగలు?" అడిగాడు రాజారాం. చిన్న నవ్వు వినిపించింది. "అలా ఎదురు ప్రశ్నలు వేసి, తప్పించుకోలేవు. పది ఏళ్ళ క్రితం నువ్వు దొంగిలించిన నగల విషయం. ఎక్కడ దాచావో చెప్పు."

"చెప్పకపోతే ఏం చేస్తావు?"

"ఏమైనా చెయ్యగలను. నీ ఒంటి చర్మం ఈ కత్తితో ఒలుస్తాను. చెవులు కోసేస్తాను. కళ్ళు పొడిచేస్తాను. అప్పటికీ చెప్పకపోతే వొంటి కండలు ముక్కలు ముక్కలుగా కోసేస్తాను."

"పదేళ్ళు నేను జైలులో గడిపింది ఆ నగలు నీకివ్వడానికా!" అడిగాడు రాజారాం.

"నీతో వాదిస్తూ కూర్చోడానికి నాకు వ్యవధి లేదు. చెప్పు!"

రాజారాం మాట్లాడలేదు. చల్లగా ఏదో తగిలింది చెంప మీద. ఒళ్ళు జలదరించింది. అది కత్తి. అరవడానికి వీలు లేకుండా నోటిని ఓ చెయ్యి బలంగా నొక్కిపట్టింది. ఉల్లగడ్డ తోలు గీకినట్లు చెంపమీద చర్మాన్ని కత్తితో గీకుతున్నాడు.

మంటా, బాధా, పళ్ళు బిగించి, నరాలు బిగించి ఆ యమబాధ భరించడానికి నిశ్చయించుకున్నాడు రాజారాం.

"ఇంకా కావాలా!"

రాజారాం మాట్లాడలేదు.

నిప్పులతో కాల్చేసినట్లయింది చెవి, చెప్పలేని మంట చెవి కింద కండ కోసేశాడు.

"నువ్వు చెప్పేంతవరకూ ఇలా హింసిస్తూనేవుంటాను."

ఆ కంఠస్వరంలో ఏకోశానా దయలేదు. అన్నంత పనీ చేస్తాడు ఎవడో వీడు రాక్షసుడులా ఉన్నాడు. బాధ భరించలేక, ప్రాణం రక్షించుకుంటే చాలునని (ఇప్పుడు కాకపోయినా) మనోబలం పూర్తిగా నశించి ఇంకాసేపట్లో ఎలాగు చెపుతాడు. ఇప్పుడే చెప్పి ఆ బాధ తప్పించుకోవడం వివేకం అనుకుని "ఆగు! చెపుతాను" అన్నాడు రాజారాం.

## 22

భారతికి మెలుకువ వచ్చింది. మెలుకువరాగానే కళ్ళు తెరవలేకపోయింది. కనురెప్పలు బరువుగా ఉన్నట్లు కళ్ళు అతుక్కుపోయినట్లు అనిపించింది గొంతు ఎండుకు పోయినట్లున్నది దేనితోనో ఒళ్ళంతా బిగించినట్లు నొప్పిగా ఉంది.

జ్వరం వచ్చిందా! ఇన్ఫ్లూయంజా???? ఏమో! లేచి కూర్చోవడానికి ప్రయత్నించింది కాని లేవలేకపోయింది. ఎవరో తనని గట్టిగా ఇనప చేతులతో కావలించుకున్నట్లుంది. కిటికీ తలుపు తెరిచే ఉంది. ఆకాశంలో నక్షత్రాల వెలుగు కూడా కనిపించడం లేదు, నల్లగా ఉంది. ఉరుములు, మెరుపులు, మెరుపు మెరిసినపుడు చూసింది. మంచం మీద తన ప్రక్కన ఎవడో పడుకున్నాడు. రెండు చేతులతోనూ తనని గట్టిగా కావలించుకుని పడుకున్నాడు. ఎవడు? తన గదిలోకి ఎలా వచ్చాడు! తన పక్కన పడుకుని తనని కావలించుకుంటుంటే తనేం చేస్తోంది!

"ఎవరు నువ్వు? ఛీ! లే!" అని తన చుట్టూ పెనవేసుకున్న చేతుల్ని విడిపించుకోవడానికి చేతులు విదిలించింది భారతి కాని తన ప్రక్కన పడుకున్న మనిషి పలకలేదు, కదలలేదు, చేతులు వదలలేదు.

భారతి దిగమింగుకో లేనంత కోపం వచ్చింది. నిద్రపోతున్న తనని చెరపడానికి ప్రయత్నించిన ఆ నీచుడు ఎవడు?

"ఎవరు నువ్వు? నన్ను ఒదులు! అరుస్తాను" అన్నది భారతి పళ్ళు పట పట కొరుకుతూ.

తన పక్కన పడుకున్న మనిషిని చెంపమీద ఫెళీమని కొట్టి "ఊ ఒదులు నన్ను!" అన్నది.

ఆ దెబ్బకి కూడా అతను పలకలేదు.

"ఒదులుతావా? లేదా?"

నిశ్శబ్దం! భారతి తలవంచి, మునిపళ్ళతో అతని భుజం కొరికింది.

అప్పటికీ ఆ మనిషిలో చలనం లేదు. ఎలా పడుకున్న మనిషి అలాగే ఉన్నాడు. .భారతి తలపైకెత్తి తన పక్కన పడుకున్న మనిషి మొహం చూసింది..

తను ఊపిరి పీల్చడం, ఒదలడం ఇంజను హోరుమల్లే చెవుల్లో వినిపిస్తోంది అది మినహా అంతా నిశ్శబ్దం. పక్కన పడుకున్న మనిషిలో అసలు చలనం లేదు.

భారతికి భయం వేసింది. ఓ చెయ్యి పైకెత్తి తల దగ్గరున్న టేబుల్ లాంప్ స్విచ్ నొక్కింది. దీపం వెలుగు మంచం మీద పడింది.

కెవ్వుమని కేకపెట్టింది భారతి. నల్లగా గడ్డకట్టిన రక్తం, కళ్ళు కనిపించడం లేదు. ముఖరేఖలు కనిపించడం లేదు. ఊపిరి పీల్చడం లేదు. చలనం లేదు. కళ్ళు తెరుచుకుని ఉన్నాయి. కాని వాటిల్లో చూపులేదు. అది శవం. శవం కొయ్యబారిపోయింది. కొయ్యబారిన ఆ శవం ఆలింగనంలో తను ఇరుక్కుంది. ఆ శవం ఎవరిది? తన గదిలోకి వచ్చి తన మంచం మీద పడుకుని తనని కావలించుకుని తర్వాత ప్రాణం విడిచిన ఆ మనిషి ఎవరు అనే ఆలోచన కలగలేదు. ఒకటే ఆలోచన - కొయ్యబారిపోయిన శవం చేతుల్లో ఇరుక్కుంది తను, తన నడుం మీద నుంచి, రొమ్ము మీదకి చుట్టుకున్న ఆ చల్లని చేతులు తీసేసేందుకు బలం అంతా ప్రయోగించింది.

కాని ఆ శవం ఆలింగనంలోచి తప్పించుకోలేక పోయింది. మంచం మీద నుంచి లేవడానికి కూర్చోడానికి ప్రయత్నించింది. కొయ్యబారి తట్టెమల్లేవున్న ఆ శవం కూడా ఆమెతోపాటు లేచింది. భారతికి మతిపోయినట్లయింది. అరవాలని నోరు తెరిచిందే కాని గొంతు పెగలలేదు. చల్లగా తన ఒంటికి తగులుతున్న శవం చేతులు, తన మొహానికి అర అంగుళం దూరంలో ముద్దుపెట్టుకున్నట్లున్న ఆ శవం నోరు, గడ్డకట్టిన నెత్తురుతో భీభత్సంగా ఉన్న ఆ నిర్జీవమైన మొహం, తనతోపాటు తనని అంటి పెట్టుకుని కదులుతున్న ఆ శవం - భయంతో, రక్తపోటుతో స్పృహ పోతోంది భారతికి. స్పృహ పోతే ఇంకా ఎంతసేపు ఆ శవం చేతుల్లో అలా ఉండాలో అనే భయం మనస్సులో ఆందోళన చేస్తూ స్పృహ పోకుండా చేస్తోంది.

చెయ్యి చాచి మంచం ప్రక్కనున్న ఎలక్ట్రిక్ కాలింగ్ బెల్ మీట మీద వేలు పెట్టింది భారతి. ఎక్కడో దూరాన గణగణమని గంట మోగడం వినిపిస్తోంది,

భారతికి స్పృహ పోయింది.

## 23

జోరుగా వాన ప్రారంభం అయింది. ఈదురుగాలికి కిటికీల తలుపులు ధన్ ధన్ మని కొట్టుకుంటున్నాయి. చెవులు బద్దలు అయే ఉరుములు అయిదునిమిషాల కోసారి కళ్ళు జిగేలు మనిపించే మెరుపులు.

ఆ చప్పుళ్ళతోపాటు ఆగకుండా గణ గణ మోగుతుంది గంట. గాఢ నిద్రలో ఉన్నవాళ్ళు, సగం నిద్రలో ఉన్న వాళ్ళు అందరూ లేచారు - జల్లుపడకుండా కిటికీల తలుపులు మూసేసుకుని నిద్రపోవడానికి పూనుకున్న వాళ్ళు కొంతమంది, గణగణమని గంట ఎక్కడ మోగుతుందో అని ఆలోచిస్తున్న వాళ్ళు కొంతమంది.

కిటికీ తలుపులు మూసేశాడు శేఖర్. మళ్ళీ నిద్రపట్టడం లేదు అతనికి. సిగిరెట్ వెలిగించి చదువుకుందామని దీపం స్విచ్ నొక్కాడు. దీపం వెలగలేదు. తుఫానులో ఏ చెట్టో విరిగి ఎలక్ట్రిక్ తీగమీద పడివుంటుంది. అందుకే ఎలక్ట్రిసిటీ పోయి ఉండాలి అనుకున్నాడు. అయినా కాని లోపల ఏదో పీకుతోంది. క్రితం రాత్రి కూడా ఇలాగే జరిగిందనీ, దెయ్యం వచ్చిందనీ ప్రసాద్ అన్నాడు.

దెయ్యం ప్రత్యక్షమయ్యే ముందు దీపాలు వెలగకుండా చేస్తుందా? ఆ విషయం తెలుసుకుంటే తప్ప తనకి నిద్రపట్టదు. బల్ల సొరుగులోంచి టార్చిలైటు తీసుకుని గదిలోంచి బయటకి వెళ్ళాడు. రెండు క్షణాలు తలుపు బయట నిలబడి టార్చి వెలుగు నాలుగు మూలలా వేసి చూడాడు. బల్లలు, బీరువాలు, గోడలకున్న పఠాలు తప్ప ఇంకేమీ కనబడలేదు. మెయిన్ స్విచ్ హాలు పక్కనకింద వున్న

గదిలో ఉంది. అక్కడికి వెళ్ళి చూడాలి. ఎందుకయినా మంచిదని మళ్ళీ గదిలోకి వెళ్ళి పిస్తోలు తీసుకుని బయటికి వచ్చాడు. ఒక చేతిలో పిస్తోలు, రెండో చేతిలో టార్చి పట్టుకుని మెట్లు దిగాడు శేఖర్.

దొంగ కానీ, దెయ్యం కానీ అతనికి ఎదురు కాలేదు. రకరకాల చప్పుళ్ళు మాత్రం వినిపిస్తున్నాయి. ఆ చప్పుళ్ళన్నీ దెయ్యమే చేస్తోందని అంటాడు ప్రసాద్. తనలో తను నవ్వుకున్నాడు.

మెయిన్ స్విచ్ దగ్గరికి వెళ్ళి టార్చి వెలుగులో పరీక్ష చేశాడు. ఫ్యూజ్‌లు సరిగానే ఉన్నాయి. కాని దీపాలు ఆరిపోయాయి. తను మొదట అనుకున్నట్లు తీగె బయట ఎక్కడో తెగిపోయి ఉంటుంది. ఇల్లంతా ఇలా చీకటిగా ఉంటే ఎవరైనా దేనికైనా హాల్లోకి వచ్చి ఏ నీడో, మెరుపో, వెలుగో చూసి దడుసుకోవచ్చు.

హాల్లోనూ, మెట్లమీదా లాంతర్లయినా పెట్టించాలి అనుకుని శేఖర్ నౌకర్లు పడుకునే వైపు నడిచాడు అటు వెళుతున్న కొద్దీ గణ గణమంటూ గంటల చప్పుడు మరింత దగ్గిరగా వినిపిస్తోంది. చెవులు చిల్లులు పడేటట్లు గంట అలా మోగుతున్నా ఎవరు ఎందుకు నిద్రలేవలేదు. అందరూ వాళ్ళ వాళ్ళ గదుల్లో కదలకుండా ఎందుకు పడుకున్నారు!

వంట ఇంటి తలుపు దగ్గర ఆగి చూశాడు. వంట ఇంటి తలుపు మూసేవుంది. తలుపు తట్టాడు. ఎవరూ పలకలేదు.

"సుబ్బయ్యా!" కేకేశాడు.

లోపల్నుంచి జవాబు లేదు

"తలుపు తెరు. నేను శేఖర్‌ని."

"అయ్యగారూ వస్తున్నానండి."

నిమిషం తర్వాత వంట ఇంటి తలుపు తెరుచుకుంది. సుబ్బయ్య ఒణుకుతూ గుమ్మం దగ్గర నిలబడ్డాడు.

"ఏమిటా గంట? ఎక్కణ్ణించి?" అడిగాడు శేఖర్.

"అవతల నడవాలో వున్న కాలింగ్ బెల్ అయివుండాలి సార్."

"అంటే ఎవరో పిలుస్తూ ఉండాలి. గంట మోగుతున్నా ఎవరూ ఎందుకు లేవలేదు?"

"చీకటి" అన్నాడు సుబ్బయ్య.

అతనితో ఇక చర్చించదలుచుకోలేదు శేఖర్ "మునయ్యా, దాసీది ఎక్కడుంటారు?" అడిగాడు.

" మునయ్య నడవాకి అవతల గదిలో పడుకుంటాడు. దాసీది ఇవతల గదిలో పడుకుంటుంది."

"రా గంట ఎక్కడున్నదో చూపించు" అని శేఖర్ వెనక్కి తిరిగాడు. సుబ్బయ్య నడవాలోకి వచ్చి గోడకి వున్న కాలింగ్ బెల్స్ చూపించాడు.

"ఇన్ని బెల్స్ ఎందుకు?"

"మేడమీద గదుల్లో ఎవరు పిలుస్తున్నదీ తెలుసుకోవడానికి సార్! ప్రతి గదికీ విడివిడిగా ఓ బెల్ ఉంది."

శేఖర్ టార్చి వెలుగు వరసగా ఒక దాని కింద ఒకటి వున్న ఆ బెల్స్ మీద వేశాడు.

మూడో బెల్ మోగుతోంది.

"ఆ గంట ఎవరి గదిలోది?" అడిగాడు శేఖర్.

"అది నర్సు అమ్మగారి గదిలోది"

ఆ మాట అనగానే శేఖర్ చటుక్కున వెనక్కి తిరిగి పరిగెత్తాడు.

సుబ్బయ్య విషయం ఆలోచించలేదు. చీకట్లో సుబ్బయ్యని ఒదిలి వెళుతున్నాననే ఆలోచన రాలేదు, భారతి గదిలో బెల్ మోగుతోంది. భారతి పిలుస్తోంది. అర్ధరాత్రి! చీకటి! భారతి ఏం అపాయంలో ఉందో అని అతని ఆందోళన. ఎలక్ట్రిసిటీ పోయిన ఇంట్లో ఎలక్ట్రిక్ బెల్ ఎలా మోగుతున్నదనే అనుమానం కలుగలేదు. ఊపిరి తీసుకోకుండా పరిగెత్తాడు. భారతి గది చేరుకోగానే తలుపు తట్టాడు. లోపల్నుంచి జవాబు లేదు. వెనక ఏదో అలికిడి అయేసరికి వెనక్కి తిరిగి చూశాడు శేఖర్. చీకట్లో ఒంటిగా ఉండడం ఇష్టంలేక సుబ్బయ్య శేఖర్ వెనకే మేడ మీదకి వచ్చాడు.

శేఖర్ తలుపు తోశాడు. తెరుచుకుంది. లోపల చీకటిగా ఉంది. టార్చి వెలుగు వెంటనే గదిలోకి వెయ్యడం ఇష్టం లేదు శేఖర్కి. "భారతీ" పిలిచాడు.

జవాబులేదు కిటికీలు దభీ దభీమని కొట్టుకుంటున్నాయి. టార్చి వెలిగించాడు. భారతిని కావలించుకుని ఓ మనిషి మంచం మీద పడుకునుండటం చూశాడు. శేఖర్ చటుక్కున టార్చి ఆర్పేసి, ఒక్క అడుగు వెనక్కి వేశాడు. ఏం చెయ్యాలో తోచలేదు. ఏదో పొరపాటు జరిగింది ఆ బెల్ భారతి గదిలోది అయి వుండదు.

"అయ్యగారూ! మంచం మీద మనిషి మొహం చూశారా!" అడిగాడు సుబ్బయ్య.

"లేదు, ఏం?" అడిగాడు శేఖర్ రహస్యంగా.

"రక్తం.. రూపు రేఖలు కనిపించడం లేదు"

"భారతి! భారతి! కాలింగ్ బెల్ నొక్కింది నువ్వేనా?" అడిగాడు శేఖర్ టార్చి వెలిగించకుండా. టార్చి వెలిగించి భారతిని అవమానించదలుచుకోలేదు.

గదిలోంచి జవాబు లేదు. సుబ్బయ్య శేఖర్ని అడిగి టార్చి తీసుకుని వెలిగించి చర చర గదిలోకి వెళ్ళి మంచం దగ్గర ఆగిపోయి "అయ్యగారూ" అంటూ బెదిరిపోయి వెనక్కి తిరిగి నేలమీద ఒరిగిపోయాడు.

శేఖర్ ఒక్క గంతులో సుబ్బయ్య దగ్గరికి వెళ్ళి అతని చేతిలోంచి టార్చి లాక్కుని "ఏమిటి! లే! నిలుచో!" ఆ వెలుగు మంచం మీద వేసి చూశాడు. కళ్ళు తిరిగిపోయాయి, రక్తం మాడుమీంచి మెడవరకూ కారి గడ్డ కట్టిపోయింది కనురెప్పలు తెరుచుకునే ఉన్నాయి. కళ్ళ చుట్టూ రక్తపు మరకలు: చూపులేదు ఆ కళ్ళలో. నోరు తెరుచుకుని ఉంది. కింది దవడ బాగా కిందకి జారి బిగుసుకుపోయింది. నాలిక బయటికి వెళ్ళుకు వచ్చింది.

వెంటనే ఆ వికృత రూపం ఎవరిదో గుర్తుపట్టలేకపోయాడు శేఖర్. కాని ఏదో స్ఫురించి "మామయ్య!" అన్నాడు.

"అవును" అన్నాడు సుబయ్య తేరుకుని.

"మామయ్యా!" పిలిచాడు శేఖర్.

"ప్రాణం లేదండీ!" సుబ్బయ్య నెమ్మదిగా చెప్పాడు.

శేఖర్ ఒంగి వైకుంఠరావు ముక్కు దగ్గిర వేలుపెట్టి చూశాడు. ఊపిరి లేదు వెంటనే ఆందోళనతో, భయంతో భారతిని చూశాడు. కళ్ళు మూసుకుని పడుకుంది. రొమ్ము పైకి కిందకీ కదులుతోంది. అది చూడగానే శేఖర్కి ప్రాణం వచ్చినట్లయింది. కాలింగ్ బెల్ మీదవున్న భారతి చెయ్యి చూశాడు. నెమ్మదిగా ఆ చెయ్యి తీసి ఆమె రొమ్ము మీద పెట్టి "భారతి! భయంలేదు! లే!" అన్నాడు ఆప్యాయంగా.

భారతి పలక లేదు!

"స్పృహ పోయింది సారె!" చెప్పాడు సుబ్బయ్య.

శేఖర్ చటుక్కున వెనక్కి తిరిగి కూజాలో నీళ్ళు గ్లాసులో పోసి తీసుకొచ్చి భారతి మొహం మీద చల్లాడు.

భారతి పెదిమలు తడి చేసుకుంటోంది. కనురెప్పలు కదులుతున్నాయి. తల ఆడిస్తోంది. బరువుగా ఊపిరి పీలుస్తోంది.

"భారతీ! లే! భయంలేదు. నేను శేఖర్ని" అన్నాడు ఆమె తల నిమురుతూ. భారతి మొహం మీదనుంచి దృష్టి మరల్చలేదు. ఆమె పక్కన పడుకున్న ఆ వికృతాకారాన్ని చూసే ధైర్యంలేదు అతనికి.

క్షణం పాటు అయోమయంగా చూసింది భారతి. లేచి కూర్చోవడానికి ప్రయత్నించింది కాని కొయ్యబారిన శవం చేతులలోంచి కదలలేకపోయింది. పక్కకి మొహం తిప్పి శవాన్ని చూసి జరిగిందంతా జ్ఞాపకం వచ్చి వెర్రి కేకలు ప్రారంభించింది.

"సుబ్బయ్యా! ఇలారా! ఈ చేతులు లాగు.." అన్నాడు శేఖర్.

సుబ్బయ్య రాతి బొమ్మలా నిలబడ్డాడు. కళ్ళు పెద్దవి చేసి శేఖర్ని చూశాడు.

"ఏం కదలవేం!" అన్నాడు శేఖర్.

"అయ్యా! నేను.. నాకు భయం!" అని గొణిగాడు సుబ్బయ్య.

"అయితే వెళ్ళి మా బాబాయిని లేపు - త్వరగా వెళ్ళు!"

సుబ్బయ్య గదిలోంచి పరిగెత్తాడు.

"భారతీ భయమేమీలేదు శవం కొయ్యబారింది అంతే" అని ఆమెకి ధైర్యం చెప్పాడు శేఖర్.

భారతి సొమ్మసిల్లిపోయి దిండుమీద తలవాల్చి, కళ్ళు మూసుకుంది.

భారతి కేకలకి ఇంట్లో అందరూ లేచారు. కామరాజు భారతి గది తలుపులకి అవతల నిలబడ్డారు. ప్రసాద్ కూడా వచ్చాడు. గదిలోపలికి రావడానికి ఎవరూ సాహసించలేకపోయారు.

"ఎవరది? ఏం జరిగింది? నాన్న ఏడీ?" అడిగింది పద్మ.

"ప్రసాద్ పద్మని అవతలకి తీసుకెళ్ళు!" కేకేశాడు శేఖర్.

లింగమూర్తి, శేఖర్ తమ బలం అంతా ఉపయోగించి భారతిని ఆ శవం చేతుల్లోంచి విడిపించారు. వెంటనే భారతిని కామరాజు గదిలోకి తీసుకెళ్ళి, పడుకోమనీ, కాసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పాడు శేఖర్. భానుమతిని పిలిచి తోడుండమని చెప్పి భారతి గదిలోకి వెళ్ళాడు. అప్పటికి కామరాజు తేరుకుని "ఏమిటిది? ఏం జరిగింది?" అడిగాడు శేఖర్ని.

"ఏం జరిగిందో నాకూ తెలియదు" అని తనకి తెలిసిన విషయాలు తండ్రితో చెప్పాడు శేఖర్.

భానుమతి, దాసీది, పద్మ, భారతి పక్కగదిలో వున్నారు శవం వున్న గదిలో మొగాళ్ళు మాత్రం ఉన్నారు.

"టెలిఫోన్ పనిచెయ్యడంలేదు. కనుక తెల్లారిన తర్వాత ఎవరయినా వెళ్ళి పోలీసులకి రిపోర్ట్ చెయ్యాలి" అన్నాడు శేఖర్.

"పోలీసులు వచ్చి ఏం చేస్తారు?" అడిగాడు కామరాజు.

"సహజమైన చావు కాదు ఇది. మామయ్య హత్య చెయ్యబడ్డాడు. తెలియజేయవలసిన బాధ్యత ఉంది"

"పోలీసులకి తెలియజేయవచ్చు కాని వాళ్ళు వస్తే మాత్రం ప్రయోజనం ఏం ఉంటుంది! మామయ్య హత్య చెయ్యబడ్డాడని అంటున్నావు. ఎవరిచేత హత్య చెయ్యబడ్డాడు? హత్యచేయ్యబడిన మనిషి భారతి గదిలోకి ఎలా వచ్చాడు? భారతి మంచం మీద ఎలా పడుకున్నాడు? కొయ్య బారిన శవం భారతిని ఎలా కావలించుకుంది? ఇవన్నీ మనిషే చేశాడనో, చేయించాడనో అనుకోవడం ఎలా?" అడిగాడు ప్రసాద్.

శేఖర్ ప్రసాద్ని కోపంగా చూశాడు. "నువ్వు అడిగిన ప్రశ్నలన్నింటికి నేను సమాధానం చెప్పగల స్థితిలో లేను అంతమాత్రాన మనిషి చెయ్యలేదని అనుకోవలసిన అవసరంలేదు. నింపాదిగా విచారిస్తే మనిషే చేశాడని తేలుతుంది" అన్నాడు.

ఆ రాత్రంతా తెరిపిలేకుండా, ఆకాశానికి చిల్లుపడినట్లు కుంభవృష్టి కురిసింది. ఆ ఇంట్లో ఒక్కరూ కన్నుమొయ్యలేదు. రాత్రంతా కామరాజు గదిలో అందరూ గుంపుగా కూర్చున్నారు. భారతి గదిలో ఆమె మంచం మీద శవం అలానే ఉంది. తలుపులు మూసేశారు. ఇంట్లో ఉన్న నౌకర్లు ముగ్గురూ కామరాజు గది బయట నేలమీద చతికిలబడ్డారు. తండ్రి పోయాడని పద్మకి చెప్పారు. భారతి పక్కన పడున్న మనిషి తన తండ్రేనని పద్మ నమ్మలేకపోయింది.

"ఏం చేశావు? నాన్నని ఏం చేశావు? చెప్పు!" అని అరిచింది పద్మ. భారతిని చూసి తన తండ్రిని భారతే చంపి ఉండాలన్న పద్మ మొండి వాదనకి అందరూ చికాకుపడ్డారు.

"అతను నీ గదిలోకి ఎలా వచ్చాడు? నీకేమైనా తెలుసా అమ్మా?" అడిగాడు కామరాజు భారతిని.

భారతి తల విదిలించింది. "నాకేం తెలియదు. రాత్రి ఎవరో తలుపు తట్టిన చప్పుడయింది. నిద్రలేచాను. భారతీ అని ఎవరో పిలిచారు. లేచి వెళ్ళి తలుపు తీశాను. బయట చీకటిగా ఉంది. ఎవరూ లేరు. భయం వేసి తలుపు మొయ్యబోయాను. మూసుకోలేదు ఊపిరి ఆడనట్లు, తల తిరుగుతునట్లు అనిపించింది. స్పృహ పోతున్నట్లయింది అంతే, ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. మళ్ళీ నిద్ర మెలుకువ వచ్చి చూసేసరికి నా పక్కన -" అని ఆగిపోయింది భారతి.

అందరూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు. అందరి మనసుల్లో అనేకమైన ప్రశ్నలు! ఎవరు సమాధానం చెప్పలేని ప్రశ్నలు!

"పద్మా! పొద్దున్న చెపితే విన్నావు కావు" అన్నాడు ప్రసాద్.

"ఏం చెప్పావు? అడిగాడు లింగమూర్తి కొడుకుని.

"ఈ ఇంట్లో దెయ్యం ఉందనీ. వెంటనే వెళ్ళిపొమ్మనీ చెప్పాను"

"పిచ్చి పిచ్చిగా మాట్లాడక" అన్నాడు శేఖర్.

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..?
లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా?
వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library